# 12

# క్రొత్త నిబంధన సంఘము

లోకంలో జీవించడానికి నిర్ణయాలు చేసికొనడం తప్పనిసరి. చాలవరకు మన నిర్ణయాలు కొద్దివి, తాత్కాలికమైనవి, అంతగా ప్రాముఖ్యత లేనివైయుంటాయి. కాని కొన్ని నిర్ణయాలు ఎంతగా ప్రాముఖ్యమైనవంటే, ఈ జీవిత కాలంలో దేవుని సముఖంలో జీవించు విషయంలో తమ ప్రభావాన్ని కనుపరుస్తాయి మరియు మన నిత్య గమ్యాన్ని అవి నిర్ణయిస్తాయి. ఈ జీవితం మీదను నిత్యత్వం మీదను తమ ప్రభావాన్ని కనుపరచే నిర్ణయాలను తీసికొనకముందు తీవ్రమైన ఆలోచన, ప్రార్థనా పూర్వకమైన పరిశోధన అవసరం. క్రొత్త నిబంధన సంఘంలో ప్రవేశించే నిర్ణయం తీసికొనేదానికంటె అధికమైన నిర్ణయం కొరకు ఆలోచించేది ఏదీ ఉండదు. ఈ ప్రశ్న విషయమై మనం తీసికొనే నిర్ణయం – దేవుని కొరకు మన అనుదిన జీవితం, ఆత్మ సంబంధమైన మన గుర్తింపు, మన ఆరాధన, ఆత్మ సంబంధమైన మన సేవ అనే వాటిపై తన ప్రభావాన్ని చూపుతోంది. అప్పుడు, స్పష్టమైన లేఖనాల ఉపదేశానికిని, పరపక్ష ద్వేషములేని శ్రేష్ఠమైన తార్కిక జ్ఞానానికి జవాబు వచ్చే పర్యంతము ఈ ప్రశ్నను బహు దీర్ఘంగా ఆలోచన చేయాలి.

మన సమర్పణకును, భక్తికిని విన్నపం చేసే విభిన్నమైన సంఘాలతో మన ప్రపంచం నింపబడియుంది. ఒక నిర్ణయం చేయబడాలి. క్రొత్త నిబంధన సంఘమేది? దేనిని బట్టి మనం తీర్మానించాలి?

రుజువును గూర్చి లేక సాక్షాధారమును గూర్చి జాగ్రత్తగా ఆలోచించడానికి మనకు సహాయపడేలా విచక్షణా జ్ఞానంతో కూడిన మార్గ సూచికలననుసరించి, సరియైన దాన్ని ఎన్నుకోవాలి, మనం ఎన్నుకున్నది దేవునికి ప్రీతికరమైయుండాలి. యథార్థతతో ఈ గైడ్‌లైన్సును మనం వెంటాడినట్లయితే, నేటి ప్రపంచంలో క్రొత్త నిబంధన సంఘాన్ని మనం గుర్తింపగలం.

ఈ గైడ్‌లైన్సు ఏవి?

## మొదటి శతాబ్దంలో సంఘం ఎలా గుర్తింపబడింది?

క్రొత్త నిబంధనలో సంఘమును గూర్చి యివ్వబడిన దృశ్యం అపొ. 2యొక్క తరువాత భాగంలో యివ్వబడింది. ప్రభువుచేతను, ఆయన అపోస్తలులచేతను సంఘమును గూర్చి వారి ప్రవచనాలద్వారా యివ్వబడిన రూపచిత్రం కొరకు సువార్త రచనలు మనయందు ఒక నిరీక్షణను, అపేక్షను కలిగించాయి (మత్తయి 16:18; మార్కు 9:1; అపొ. 1:4-8). అప్పుడు, అపొ. 2లో, సంఘము స్థాపించబడగా, సంఘము యొక్క సజీవమైన రూపచిత్రము పరిశుద్ధాత్మచేత మనముందు ఉంచబడింది.

సంఘము యొక్క ఈ రూప చిత్రము, దాని ప్రధాన లక్షణాలను మనం చూచేలా సహాయపడుతుంది. నిజ జీవితంలో, క్రీస్తు ప్రభువు స్థాపించిన సంఘం ఎలా ఉంటుందో అని మనకిక ఆశ్చర్యం కలుగదు.

అపొ. 2లో లూకాచే యివ్వబడిన సంఘము రూపచిత్రంలోని ప్రధాన లక్షణాలను జాగరూకతతో పరిశోధించు:

> వీరు అపొస్తలుల బోధయందును సహవాసమందును, రొట్టె విరుచుటయందును ప్రార్థన చేయుటయందును ఎడతెగక యుండిరి.
>
> అప్పుడు ప్రతివానికిని భయము కలిగెను. మరియు అనేక మహత్కార్యములును సూచక క్రియలును అపొస్తలుల ద్వారా జరిగెను. విశ్వసించినవారందరు ఏకముగా కూడి తమకు కలిగినదంతయు సమష్టిగా ఉంచుకొనిరి. ఇదియుగాక వారు తమ చరస్థిరాస్తులను అమ్మి, అందరికిని వారి వారి అక్కరకొలది పంచిపెట్టిరి. మరియు వారేకమనస్సులై ప్రతిదినము దేవాలయములో తప్పక కూడుకొనుచు ఇంటింట రొట్టె విరుచుచు, దేవుని స్తుతించుచు, ప్రజలందరివలన దయపొందినవారై ఆనందముతోను నిష్కపటమైన హృదయముతోను ఆహారము పుచ్చుకొనుచుండిరి. మరియు ప్రభువు రక్షణపొందుచున్న వారిని అనుదినము వారితో చేర్చుచుండెను (అపొ. 2:42-47).

సంఘము యొక్క ఏ గుణగణాలను ఈ చిత్రంలో మనం చూస్తాం?

## సమర్పణలో దృఢముగా ఉన్నారు

మొదటి గుణలక్షణము, అపొస్తలుల ఉపదేశము లేక బోధకు స్థిరముగా కట్టుబడియుండడం. లూకా యిలా అన్నాడు. "వీరు అపొస్తలుల బోధయందును సహవాసమందును రొట్టె విరుచుటయందును ప్రార్థన చేయుటయందును ఎడతెగక యుండిరి" (అపొ. 2:42).

సంఘము అపొస్తలుల బోధకు తన్ను తాను అప్పగించుకొన్నదే, వారి బోధను నమ్మకంగా అనుసరించుతున్నట్టు తేటపడుతుంది; ఆరాధనలో వారు కలిసి కూడడం, సేవించడం; ప్రభురాత్రి భోజనంలో పాలుపొందడం లేక రొట్టెవిరవడం;[1] మరియు ప్రార్థన చేయడం అనేవి క్రమంగా జరుగుతున్నాయి. అపొస్తలుల ద్వారా యివ్వబడుతున్న ఆయన వాక్యాన్ని ఘనపరచుటచే, ఆయన సంఘమందు ఆయన నాయకత్వాన్ని వారు గుర్తించారు. క్రీస్తు వారికి శిరస్సైయున్నాడు.

తన సంఘముగా క్రీస్తును అనుసరించడంలో ఉన్న సరళత్వంనుండి క్రైస్తవ లోకంలో ఉన్న విభజన మనలను కలతపరచ కూడదు. సంఘము మానవ నిర్మితమైన సభ లేక సమాజము కాదు. పరిశుద్ధాత్మయొక్క సందేశానికి తమ్మును తాము అప్పగించుకొని, ఆ విధంగా సువార్తకు లోబడినవారై, పరిశుద్ధాత్మచేత వారు క్రీస్తు సంఘముగా సమకూర్చబడ్డారు. వారు క్రీస్తుకు మాత్రమే చెందుతారు. వారు ఏ మానవ నాయకత్వం వైపు చూడరు, బయలుపరచబడిన ఆయన వాక్యము ద్వారా, శరీరమునకు శిరస్సైయున్న క్రీస్తుచే వారు నడిపింపబడతారు. దైవ ప్రేరేపితమైయున్న ఆయన వాక్యమందు నిలుచున్నదాని మీదనే వారు తమ విశ్వాసమును చూస్తారు. క్రైస్తవుల ఆరాధనను, లోకంలో క్రీస్తుప్రభువు యొక్క చేతులుగా తమ పనిని, అనుదినము వారు క్రీస్తుకొరకు జీవించే విధానమును బైబిలు నడిపిస్తుంది.

సంఘము యొక్క పరిశుద్ధాత్మ చిత్రాన్ని మనం చూస్తూ ఉండగా, బలమైన సమర్పణ అనే లక్షణాన్ని మనం చూస్తాం.

## స్వార్థ రహితమైన దయ

సంఘము యొక్క దైవికమైన చిత్రంలో, మనం విస్మరించలేని మరొక గుణలక్షణ మేమంటే, ఒకరి పట్ల మరియొకరికి ఉన్న స్వార్థరహితమైన దయ. సత్యానికి వారు కనుపరచిన యథార్థమైన విధేయత తమయందు ఒకరియెడల ఒకరికి ప్రేమ పూర్వకమైన దయను పుట్టించింది. దీన్ని లూకా యిలా వర్ణించాడు, “ఇదియు గాక వారు తమ చరస్థిరాస్తులను అమ్మి, అందరికిని వారి వారి అక్కరకొలది పంచిపెట్టిరి” (అపొ. 2:45).

పెంతెకొస్తు దినాన్ని ఆచరించడానికిగాను రోమా సామ్రాజ్యమంతటినుండి యూదులు వచ్చారు. ఈ పెంతెకొస్తు సాధారణమైనదై యుంటుందని వారు అనుకున్నారు; కాని, వారికి బహుశా ఆశ్చర్యం కలిగించేలా, అది అలా లేదు. ప్రవక్తలు ఎదురు చూచిన చారిత్రక దినమది. పేతురు యొక్క ప్రసంగం విన్నతోడనే అనేకులు క్రైస్తవులుగా

మారాలని కోరారు (అపో. 2:41). క్రీస్తుకు చూపిన వారి విధేయత, వారికి విప్లవాత్మకమైన మార్పుగా అయ్యింది. ఒక విషయానికి వారు ఏ సంఘంలో సభ్యులుగా చేర్చబడ్డారో, ఆ సంఘాన్ని గూర్చి యింకను బోధింపబడడానికి వారు యెరూషలేములో నిలిచియుండవలసి వచ్చింది. యెరూషలేములో నిలిచి యుండాలని తటాలున జరిగిన నిర్ణయం, వారిని యిబ్బందుల్లో పడవేసింది. ఎందుకంటే, అలా నిలిచియుండడానికి ముందుగా వారెట్టి ప్లాన్లు కూడా చేసికోలేదు. వారికి భోజనం, నివాసము అవసరమనేది నిస్సందేహం. దూరంనుండి యిబ్బందులకు గురియైన తమ సోదర సోదరీమణుల పట్ల అలాటి యిబ్బందులు లేనివారు ఎలా స్పందించారు? అరుదుగా దానికి సాటియయ్యే తీరులో దయాపూర్వకమైన వారి ప్రేమ కనుపరచబడినట్టు చిత్రింపబడింది. ఆ సహోదరులను ఆదుకొనడానికి స్థానికులలో కొందరు తమ యిండ్లను భూములను సహితం అమ్మివేశారు. తన సంఘములో ఒక భాగంగా ఉండేలా క్రీస్తు ఉద్దేశించిన దయతో కూడిన లక్షణానికి వారి చర్య రుజువుగా నిలిచింది.

వారి పంపిణీ వర్ణనను అధిగమించి రమ్యంగా ఉన్నట్టు చేసిన వాస్తవమేమంటే– యిచ్చిన ఆ ఈవులు పూర్తిగా యిష్టపూర్వకమైనవి. వారి ఈవిని అపొస్తలులు బలవంత పెట్టలేదు సరిగదా, కనీసం దానిని వారు కోరనూ లేదు (అపో. 5:4). క్రీస్తును పోలిన ప్రేమనుండియు దయగల హృదయాలనుండియు అది ఉబికింది. క్రీస్తు వారియందు నూతనమైన స్వభావాన్ని, స్వార్థరహితమైన దయను ప్రకటించాడు.

వారి పంపిణీ అందరికి సమానంగా ఉండడానికి యివ్వబడిన ఈవి కాదు లేక అందరికి ఒకే పరిమాణంలో వస్తువులు ఉండడం కాదు. అది సమష్టి సహజీవనం, అది లక్ష్యపెట్టే ప్రేమ. వారు అవసరాలలో ఉన్న వారికి యిచ్చారు. వారి అవసరాలనే గాని, దురాశలను వారు తృప్తిపరచ లేదు. ప్రతి అత్యవసరమైన దానిని వెంటనే గమనించ వలసినట్టు వారు ఎరుగుదురు. ప్రజలకు అవసరాలు ఉత్పన్నమయ్యే కొలది, వాటిని తీర్చడానికి యితరులు ప్రేమతో స్పందించారు. అది త్యాగమును కోరినా సరే!

తరువాత సంఘాన్ని గూర్చి లూకా యిలా అన్నాడు, “భూములైనను ఇండ్లయినను కలిగినవారందరు వాటిని అమ్మి, అమ్మిన వాటి వెల తెచ్చి అపొస్తలుల పాదములయొద్ద పెట్టుచు వచ్చిరి. వారు ప్రతివానికి వాని వాని అక్కరకొలది పంచిపెట్టిరి గనుక వారిలో ఎవనికిని కొదువలేకపోయెను” (అపో. 4:34, 35). అతడు యింకను యిలా తెలిపాడు, “విశ్వసించినవారందరును ఏక హృదయమును ఏకాత్మయు గలవారైయుండిరి. ఎవడును తనకు కలిగిన వాటిలో ఏదియు తనదని అనుకొనలేదు; వారికి కలిగినదంతయు వారికి సమష్టిగా ఉండెను” (అపో. 4:32).

కనికరము (లేక) దయ అనేది క్రీస్తు సంఘమునకు ప్రాథమిక గుణమైయుంది. ఆయన వాక్యానికి నమ్మకమైన విధేయత ఎక్కడ ఉండదో అక్కడ ఆయన సంఘము ఉండనేరదు; క్రీస్తు ప్రభువు యొక్క హృదయాన్ని వ్యక్తపరచే కనికరము విస్తరించకుండ ఆయన సంఘమే లేదు. దేవుని ప్రేమ వారి హృదయాలలో నివసించుచు, నిజక్రైస్తవుల మధ్య సహోదర ప్రేమను సజీవంగా నిలుపుతుంది. దీని విషయమై యోహాను యిలా అడిగాడు, "ఈ లోకపు జీవనోపాధిగలవాడైయుండి, తన సహోదరునికి లేమి కలుగుట చూచియు, అతనియెడల ఎంతమాత్రమును కనికరము చూపనివానియందు దేవుని ప్రేమ యేలాగు నిలుచును? (1 యోహాను 3:17).

సంఘమును గూర్చి ఆత్మయొక్క తొలి పటములో, స్వార్థరహితమైన దయ లేక కనికరము ఒక ప్రాముఖ్యమైన లక్షణమైయున్నట్టు స్పష్టంగా ఉంది.

## క్రీస్తునందు ఏకమై ఉండుట

క్రీస్తు సంఘము యొక్క గుణంగా కన్పించే మూడవది – దాని ఏకత్వము. జనులు సువార్తకును, అపొస్తలుల బోధకును విధేయులగుటవలన, క్రీస్తు సంఘముయొక్క సభ్యులకు పరిశుద్ధాత్మ ఏక మనస్సును ప్రసాదించాడు. లూకా యిలా అన్నాడు, "విశ్వసించినవారందరు ఏకముగా కూడి తమకు కలిగినదంతయు సమష్టిగా ఉంచుకొనిరి" (అపొ. 2:44). ఇంకను అతడిలా అన్నాడు, "మరియు వారేకమనస్కులై ప్రతిదినము దేవాలయములో తప్పక కూడుకొనుచు, ఇంటింట రొట్టె విరుచుచు, దేవుని స్తుతించుచు, ప్రజలందరివలన దయ పొందినవారై ఆనందముతోను నిష్కపటమైన హృదయముతోను ఆహారము పుచ్చుకొనుచుండిరి" (అపొ. 2:46).

ప్రభువైన యేసు నిర్మించిన సంఘములో రమ్యమైన ఏకత్వమున్నట్టు మనం తిలకించాం, ఈ సంఘ చిత్రముయొక్క ప్రాముఖ్యతను మనం జ్ఞాపకం చేసుకొందాం. ఈ పటం క్రీస్తు ప్రభువుయొక్క భూ నివాస జీవితం మరియు ఆయన మరణం యొక్క ఫలితాలను వివరిస్తుంది. ఎలాటి సంఘాన్ని క్రీస్తు నిర్మించడానికి లేక సృజించడానికి వచ్చాడు? అనేకమైన పేర్లు పెట్టుకొని, ఆయా మత విశ్వాసాల క్రింద జీవించుతూ, ఒకరితో నొకరికి సంబంధంలేని అనేక శరీరములుగల పెద్ద సంస్థనా? లేక శిరస్సుగా ఆయన ఏలుబడిచేసే ఏక శరీరాన్ని ఆయన కలుగజేయడానికి వచ్చాడా? క్రొత్త నిబంధన అంతటిలోను తన సంఘం ఎట్టిదైయుండాలో, లోకమందు అది ఎలా ఉండాలని ఆయన కోరుకున్నాడో, అపొ. 2లో అతి స్పష్టమైన స్వరూపాన్ని మనం చూస్తాం. ఆ సంఘం యొక్క సహజ గుణమైన ఏక మనస్సు ఏక జీవితాన్ని తప్పు లేకుండా ఈ

చిత్రం బయలుపరచుతోంది. తన సంఘం నేడు యిలాగే ఉండాలని క్రీస్తు ప్రభువు కోరుతున్నాడు. తన లోక జ్ఞానముతో, క్రీస్తు సంఘాన్ని విడిచి, మనుష్యుడు తన సొంత సంఘాలను కట్టుకుంటున్నట్టు, మత ప్రపంచమంతటిలో అలుముకొన్న విభజనలే నిశ్చయమైన గురుతైయుంది.

ప్రభువు సంఘముయొక్క ఏకత్వము వివాహము ద్వారా ఉదహరింపవచ్చు. వివాహమందు స్త్రీ పురుషులు ఏకం చేయబడతారు (ఎఫెసీ. 5:31). వారి వివాహపు వేడుక తరువాత, వారు ఒక నూతనమైన కుటుంబంగా బయటికి వస్తారు. ఇప్పుడు వారిద్దరు ఒకరికొకరు చెందుతారు, వారు ఒక నూతనమైన రూపానికి వస్తారు. స్వార్థపరమైన కోర్కెలు, వ్యక్తిగతమైన గమ్యాలు చస్తాయి; క్రొత్త కోర్కెలు, గమ్యాలు ఈ క్రొత్త కుటుంబం యొక్క క్షేమం కొరకు సజీవంగా వస్తాయి. హృదయమునందును ఆత్మయందును ఏకమై వారు ఏకంగా జీవించుతూ, వారి యింటి భవిష్యత్తు కొరకు కలిసి పని చేస్తూ, ప్రేమించుకొంటూ కుటుంబాన్ని నడుపుకొంటారు. వారికి ఈ ఏకత్వం ఎలా యివ్వబడింది? వివాహపు బంధంలో ప్రవేశించడానికి వారిద్దరు సమ్మతించి, వివాహ ధర్మాన్ని నెరవేర్చుకొనడానికి వారందులో ప్రవేశించారు. ఆ ఏకత్వాన్ని వారు ఎలా నిలుపుకోగలరు? ఒకరినొకరు ప్రేమించుకొనడం ద్వారా, ఒకరినొకరు లక్ష్యపెట్టుట ద్వారా, ఒకరికొకరు తమ్మును యిచ్చుకొనుట ద్వారా, వారి వివాహపు ప్రమాణాలను గౌరవించడం ద్వారా, వివాహమనే ఆశీర్వాదకరమైన స్థితిని ఘనపరచడం ద్వారా ఆ వివాహాన్ని వారు నిలుపుకుంటారు.

సంఘం విషయములో ఇది సత్యం కాదా? సంఘం యొక్క ఏకత్వంలో మనం ఎలా ప్రవేశిస్తాం? వ్యక్తిగతమైన అంగీకారంతో, మన జీవితాలను క్రీస్తు సువార్తకు సమర్పించుకొనుటకు తీర్మానించుకొని, సంఘమనే ఆయన శరీరములోనికి ప్రవేశిస్తాం. ఆ శరీరములో మనము ప్రవేశింపగా, క్రీస్తుతోను, అందులో ఉన్న ప్రతి సభ్యునితోను పరిశుద్ధాత్మ ఏకం చేస్తాడు. ఒకే ఆత్మ, ఒకే హృదయంతో, మనం ప్రేమించుకొంటూ, సేవించుతూ, ఏక శరీరంగా జీవిస్తాం. ఈ ఏకత్వాన్ని మనం ఎలా నిలుపుకుంటాం? ఒకనినొకడు ప్రేమించుకొంటూ, ఒకనినొకరు క్షమించుకొంటూ, ఆరాధనలోను, సేవలోను, దినచర్యలోను క్రీస్తు వాక్యాన్ని ఘనపరచుతూ ఉండాలి.

క్రీస్తు సంఘముయొక్క కాదనలేని గుణము ఏకత్వము. విభజనలు ఉన్న స్థలములో క్రీస్తు ప్రభువుయొక్క నిజమైన సంఘము ఉండనేరదు. మనము క్రీస్తు శరీరములోనికి ప్రవేశించినప్పుడు ఈ ఏకత్వము పరిశుద్ధాత్మ ద్వారా మనకు అనుగ్రహింపబడింది; మనము ఆ శరీరముగా జీవిస్తుండగా, మనం దానిని నిలుపుకోవచ్చు లేక దానికి

హాని కలుగజేయవచ్చు. క్రీస్తు శరీరములోని విభజన అనేది ఏ క్రైస్తవుని మనస్సులోనికి రాకూడదు. పరిశుద్ధాత్మయొక్క రూప చిత్రాన్ని బట్టి, ఈ లోకమంతటిలో ఏకత్వాన్ని కనుగొనవలసింది క్రీస్తు శరీరములోనే.

## నేడు సంఘము ఏలాగున గుర్తింపబడగలదు?

### దాని ప్రారంభాన్ని ఆలోచించు

క్రొత్త నిబంధన సంఘాన్ని గుర్తించే (పుట్టుమచ్చలవంటి) గురుతులలో ఒకటి దాని ప్రారంభ కాలము. క్రొత్త నిబంధన సంఘం ఆరంభమైనప్పుడు ఆరంభంకాని ఏ సంఘమైనా క్రొత్త నిబంధన సంఘం కాదు.

తన వ్యక్తిగతమైన పరిచర్యలోని నాల్గింట మూడువంతులు గడిచిన పిమ్మట, “నేను నా సంఘమును కట్టుదునని” ప్రభువు వాగ్దానం చేశాడు (మత్తయి 16:18). తన పునరుత్థానం తరువాత వచ్చిన తొలి పెంతెకొస్తు దినాన ఆయన తన వాగ్దానాన్ని నెరవేర్చాడు (అపొ. 2:41–47). ఆ పెంతెకొస్తు దినం మొదలుకొని, క్రొత్త నిబంధన అంతటిలో ఆ సంఘము ఉనికిలో ఉన్నట్టు పలుకబడింది (అపొ. 5:11; 7:38; 8:1, 3).

“మా సంఘం పాత నిబంధనలో ప్రారంభమయ్యింది” అని ఒకడు అన్నాడనుకో, అతని సంఘము అతి ముందుది. పాత నిబంధన రాజ్యముయొక్క రాకను గూర్చి ప్రవచించిందే గాని, దాని స్థాపనను అది రికార్డు చేయలేదు. “మా సంఘము క్రీ.శ. మూడో శతాబ్దంలో ప్రారంభమయ్యింది” అని అన్నాడనుకో, అతని సంఘం అతి ఆలస్యంగా ప్రారంభమయ్యింది. అది క్రొత్త నిబంధన సంఘమై యుండడానికి వీలులేదు. భవిష్యత్తులో ఏదో యొక దినాన సంఘం స్థాపించబడుతుందని ఎదురు చూస్తూ క్రొత్త నిబంధన (రచన) ముగింపబడలేదు. అయితే, లోకమంతటిలో మహా బలముతో జరిగే సంఘ వ్యాప్తి క్రింద రోమా సామ్రాజ్యం వణికిపోయిందనే వాస్తవంతో అది ముగించ బడింది.

సాధారణంగా, ప్రొటెస్టాంట్ సంఘాలు పదహారవ శతాబ్ద కాలంలో ఉనికిలోనికి వచ్చాయి, అంటే దిద్దుబాటు కాలంలోగాని ఆ తరువాతగాని అవి ఆరంభమయ్యాయి. ఏ రకమైన మతశాఖయైనా, అది క్రొత్త నిబంధనలో కన్పించదు. క్రొత్త నిబంధన సంఘం స్థాపింపబడింది, ఆ మీదట శతాబ్దాల తరువాతనే, క్రొత్త నిబంధన క్రమమునుండి భ్రష్టత్వం సంభవింపనారంభించి, మత శాఖలు రూపొందాయి. క్రొత్త

నిబంధనలోని రూపచిత్రం ఏమంటే–మత శాఖలు ఉనికిలోనికి రావడానికి ఎంతో ముందుగా, జనులు క్రైస్తవులై, క్రీస్తు శరీరంగా వారు జీవించుచుతూ ఆరాధించుతూ ఉన్నారు.

ఏదోయొక ప్రత్యేకమైన సంఘాన్ని గూర్చి నీవు ఆలోచించేటప్పుడు, "దాని వాస్తవమైన ప్రారంభం ఎప్పుడు?" అని అడుగు. మన ప్రభువు పునరుత్థానుడైన తరువాత వచ్చిన తొలి పెంతెకొస్తు దినానికి కాక, మరి ఏ యితర సమయానికి వెళ్లినా, అది క్రొత్త నిబంధన సంఘం కానేరదు.

## దాని లక్ష్యాన్ని ఆలోచించు

క్రొత్త నిబంధన సంఘాన్ని గుర్తించే (పుట్టుమచ్చలవంటి) గురుతులలో మరియొకటి – దాని లక్ష్యం లేక గమ్యం. క్రొత్త నిబంధన సంఘంగా ఉండడం తప్ప ఈ లోకంలో క్రొత్త నిబంధన సంఘానికి వేరే ఏ లక్ష్యమూ లేదు. దానివలె ఉండడానికిగాని, దానికి సమపోలికగా ఉండడానికిగాని, లేక దానికి సమీపంగా ఉండడానికిగాని అది వెదకదు. అది క్రొత్త నిబంధన సంఘంగానే ఉండగోరుతుంది!

"క్రొత్త నిబంధన సంఘం ఏది?" అనే ప్రశ్నను ఆలోచించేటప్పుడు, ఒక ప్రత్యేకమైన సంఘాన్ని గూర్చి, "ఈ లోకంలో దాని లక్ష్యం (లేక) గమ్యం ఏమి?" అని నీవు అడుగవచ్చు. క్రొత్త నిబంధన సంఘము లోకములో క్రీస్తు శరీరమై యుంది. పౌలు యిలా తెలియజేశాడు, "ఆలాగే అనేకులమైన మనము క్రీస్తులో ఒక్క శరీరముగా ఉండి, ఒకనికొకరము ప్రత్యేకముగా అవయవములమై యున్నాము" (రోమా 12:5). తన సమాజములో ఏ సంఘమైనను క్రీస్తు శరీరముగా ఉండ వెదకనట్లయితే, అది క్రొత్త నిబంధన సంఘము కానేరదు.

ఒక తెగలా ఉండడానికి క్రీస్తు ప్రజలను తన శిష్యులుగా పిలువలేదు. లోకంలో తన శరీరంగా ఉండడానికి ఆయన తన శిష్యులను పిలుచుకొన్నాడు. ఈ శరీరము ఆయన పేరును ధరించాలి, కలిసి ఆయన నామములో ఆరాధన చేయాలి, ఆయన మహిమకొరకు ఈ లోకంలో ఆయన పనిని జరిగించాలి.

## దాని ఆచరణలను ఆలోచించు

క్రొత్త నిబంధన సంఘాన్ని గుర్తించే (పుట్టుమచ్చవంటి) గురుతులలో మరి యొకటి– దాని ఆచరణలు. సంఘము క్రొత్త నిబంధన సంఘమని చెప్పుకొనడం ఒక వంతు, ఆచరణలచే దాని గుర్తింపును ప్రదర్శించడం మరోవంతు. తాము క్రొత్త నిబంధన

సంఘమేనని ఎవరైనా చెప్పుకోవచ్చు, కాని అలా చెప్పుకొనేదానియొక్క రుజువు ఆచరణలపై నిరంతరము నిలిచియుంటుంది.

క్రొత్త నిబంధన సంఘముయొక్క ఆచరణలు క్రొత్త నిబంధనలో స్పష్టంగా కన్పిస్తాయి. క్రొత్త నిబంధన సంఘము వారములో ప్రతి మొదటి దినమున ఆరాధనకు కూడి, తమ ప్రభువుయొక్క మరణాన్ని జ్ఞాపకం చేసికొనడానికి గాను రొట్టె విరుస్తారు (అపొ. 20:7; 1 కొరింథీ. 11:20; హెబ్రీ. 10:25). క్రైస్తవులు కూడి తమ హృదయములలో గానము చేస్తూ, ఒకరినొకరు క్షేమాభివృద్ధి కలుగజేసికొంటూ, పాటలు పాడతారు. వారి ఆరాధనలో వాయిద్యాలు వాయించినట్టుగాని, అలా చేయమని ఆజ్ఞాపించినట్టుగాని క్రొత్తనిబంధనలో ఏ సూచనాలేదు (ఎఫెసీ. 5:19; కొలస్సీ. 3:16). దేవుని పని కొనసాగించడానికి గాను, పేదలకు సహాయపడుటకుగాను భౌతిక సంబంధమైన వారి అభివృద్ధిలోనుండి కానుకలు యిచ్చారు (1 కొరింథీ. 16:1, 2). వారు కలిసి ప్రార్థించారు మరియు దైవప్రేరేపితులైన మనుష్యులచే బయలుపరచబడిన దేవుని చిత్తాన్ని ఆలోచించేవారు (అపొ. 2:42). (235 పేజీనుండి 238 పేజీవరకు చూడు). విగ్రహాలను ఆరాధించడం, మరియు కాండిల్స్ లేక ఆరాధనలో ధూపం వేయడం వంటి ఆచరణలకు ఏ అధికారము లేదు మరియు క్రొత్త నిబంధన సంఘపు ఆచరణలో అవి భాగం కానేకావు. క్రొత్త నిబంధనయొక్క ప్రతి స్థానిక సంఘము పెద్దలు లేక అధ్యక్షుల ద్వారా స్వయం పరిపాలన కలిగియుంటుంది (1 తిమోతి 3:1-7), ప్రభువైన యేసును తనకు ఏకైక శిరస్సుగా గుర్తించుతూ సాగుతుంది. పరిచారకులు (1 తిమోతి 3:8-11) మరియు సువార్తికులు (2 తిమోతి 4:1, 2) పెద్దల యొక్క పైవిచారణ క్రింద సంఘంలో పని చేస్తారు.

క్రొత్త నిబంధన సంఘాన్ని మనము గుర్తించడానికిగాను, క్రొత్త నిబంధన సంఘముయొక్క ఆచరణలను జాబితా వేసి, మన చుట్టునున్న సంఘములయొక్క ఆచరణలతో దానిని పోల్చి చూడు. నిజమైన జతను మనం కనుగొనినప్పుడు, క్రొత్త నిబంధన నమూనాను అనుసరించే సంఘాన్ని మనం కనుగొన్నప్పుడు, ప్రభువు సంఘమైన క్రొత్త నిబంధన సంఘాన్ని మనం కనుగొన్నాం.

## దాని పేర్లను ఆలోచించు

క్రొత్త నిబంధన సంఘాన్ని గుర్తించే (పుట్టుమచ్చవంటి) గురుతులలో మరి యొకటి- దాని పేర్లు. క్రొత్త నిబంధన సంఘానికి బైబిలులో ఉపయోగింపబడిన వర్ణనకు సంబంధించిన ప్రయోగాలు దానిని మత శాఖలనుండి వేరుచేసి ప్రత్యేకంగా

ఉంచుతాయి.

క్రొత్త నిబంధన సంఘము "క్రీస్తు శరీరమ"ని (ఎఫెసీ. 4:12), "దేవుని సంఘమని" (1 కొరింథీ. 1:2); "క్రీస్తు సంఘము"లని (రోమా 16:16); "జ్యేష్ఠుల సంఘమని" (హెబ్రీ. 12:23); "పరలోక రాజ్యమని" (మత్తయి 16:19), కేవలం "సంఘమ"ని (ఎఫెసీ. 1:22) క్రొత్త నిబంధనలో సూచింపబడింది. ఈ ప్రయోగాలు సంఘముయొక్క స్వభావాన్ని దాని అభేదమును వర్ణిస్తాయి. అవి పేర్లు అనబడే దానికంటె, అవి వర్ణనలై యున్నాయి.

క్రొత్త నిబంధనలో కన్పించిన పేరుతో లేక ప్రయోగంతో తెలియజేయబడే ఒక సంఘాన్ని గూర్చి నీవు ఆలోచిస్తున్నట్టయితే, ఏమౌతుంది? అది అంగీకరింపబడదు అనే వాస్తవాన్ని మనం తప్పక ఒప్పుకు తీరాలి. మొదటిగా, అది క్రొత్త నిబంధన సంఘమై యున్నట్టయితే, క్రొత్త నిబంధనకు అన్యమైన లేక సంబంధంలేని పేరుని అది ఎందుకు ఉపయోగించాలి? రెండవదిగా, ఆ సంఘము క్రొత్త నిబంధన సంఘమైతే, అది క్రొత్త నిబంధన సంఘమని అందరికి సూచించుకొనడానికి గాను, క్రొత్త నిబంధన ప్రయోగాన్ని అది ఎందుకు ఉపయోగించ లేదు? మూడవదిగా, దానిని గూర్చి నిజంగా ఆలోచింపకుండగనే క్రొత్త నిబంధనకు అన్యమైన ప్రయోగాన్ని దానికి పేరుగా ఉపయోగించుకొనడం క్రొత్త నిబంధన సంఘానికి సాధ్యమౌతుందా? వారి దృష్టికి దీనిని తెచ్చినప్పుడు, క్రొత్త నిబంధన సంఘముగా కాకుండ వేరొకటిగా అపార్థం చేయబడకుండుటకు గాను, క్రొత్త నిబంధన పేర్లకు బహు సంతోషంగా మార్చుకుంటారు.

సంఘము క్రొత్త నిబంధన సంఘంగా ఉండగోరినట్లయితే, క్రొత్త నిబంధన గుణగణాలను అది పెంపార చేసికొంటుంది, తాను క్రొత్త నిబంధన సంఘమైయున్నట్టు ఎల్లరు ఎరగాలని కోరుకొంటుంది, క్రొత్త నిబంధన సంఘానికి సంబంధించిన పేర్లు మాత్రమే దానికిని వర్తింపజేసికొంటుంది

## ముగింపు

అన్ని కాలాలకు సంబంధించిన తక్కిన మత సంబంధమైన గుంపులన్నిటికి వేరుగా, క్రొత్త నిబంధన సంఘాన్ని గూర్చిన పరిశుద్ధాత్మయొక్క చిత్రం మూడు ఆకర్షణీయమైన లక్షణాలను బయలుపరుస్తోంది. మొదటిది, ఆయన వాక్యమునకు విధేయులై, ఆయన వాక్యానికి ఎడతెగని నమ్మకత్వంతో నిలిచియుండే ప్రజలే – ఆయన సంఘము. రెండవది, ప్రేమతో అక్కర కలిగి, ఆయన సంఘము ప్రతి సభ్యుని పట్ల దయను చూపేదిగా ఉంటుంది. దీనత్వములో ఉన్న సభ్యుల పట్ల భౌతికమైన ఆలోచనలకంటెను, ఆస్తుల

కంటెను ఎక్కువైన అక్కరను ప్రేమను కనుపరచింది సంఘము. మూడవది, సువార్తకు లోబడుట ద్వారా క్రీస్తు సంఘములోనికి ప్రవేశించిన ప్రతి వ్యక్తి, అటు క్రీస్తుతోను, యిటు సభ్యులందరితోను పరిశుద్ధాత్మచే ఏకం చేయబడతాడు. ఆ ఏకత్వాన్ని ప్రేమచేతను, అనుదినము క్రీస్తు వాక్యాన్ని అనుసరించుటచేతను కాపాడుకోవాలి లేక నిలుపుకోవాలి. ఒక్క హృదయము, ఒక్క జీవితముగల ఒక్క కుటుంబముగా సంఘము చిత్రింపబడింది.

అప్పుడు, మనం నేడు క్రీస్తు సంఘముగా ఎలా ఉండగలము? ఆ విధానాన్ని లేక పద్ధతిని "నకలు" మరియు "అంకితం" అనే రెండు పదాలు తెలుపుతాయి. ఈ పాఠమందు కన్పించే తీరులో క్రీస్తుయొక్క అనుచరుడుగా రూపొందే మార్గాన్ని నకలు తీద్దాం. పేతురుచే ప్రకటింపబడగా, ఆ ప్రజలు క్రీస్తు వాక్యాన్ని ఆలకించి, "మేమేమి చేతుము?" అని అడిగారు. "మీరు మారుమనస్సు పొంది పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసు క్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి ..." అని పేతురు వారికి తెలియజేశాడు (అపొ. 2:38). వాక్యముచే వారియందు విశ్వాసము నాటుట ద్వారా, వారు మారుమనస్సు పొందారు, పాప క్షమాపణ నిమిత్తము బాప్తిస్మము కూడా పొందారు, ప్రభువు వారిని తన సంఘానికి చేర్చుకున్నాడు. ప్రజలను తన సొత్తుగా చేసికొనడానికి యిది క్రీస్తు ప్రభువుయొక్క విధానం, నేడు ఒకడు ఈ మార్గాన్ని అనుసరించినప్పుడు, వారికి ఆయన ఏమి చేసియున్నాడో యితనికి అదే జరిగిస్తాడు. ఆయన వారిని ఎలా ప్రేమించాడో, మనలో ప్రతి ఒక్కని కూడా ఆయన అలాగే ప్రేమిస్తాడు; ఆయన వారి కొరకు ఎంతగా చనిపోయాడో, మన కొరకును ఆయన అంతగానే చనిపోయాడు.

క్రీస్తు వాక్యమునకు విధేయులమై ఆయన సంఘముగా జీవించడానికి సమర్పించుకొందాం లేక అంకితం చేసికొందాం. అపొ. 2లోని రూప చిత్రాన్ని అనుసరించి, క్రీస్తు వాక్యాన్ని హత్తుకొనియుండి, క్రీస్తు హృదయముతో జీవించుతూ, క్రీస్తునందు పరిశుద్ధాత్మ అనుగ్రహించిన ఏకత్వాన్ని నిలుపుకొంటూ కొనసాగుదాం.

క్రీస్తు సంఘము ఎలాటిదై యుంటుందో యిప్పుడు మనకు తెలుసు, క్రీస్తు సంఘముగా రూపొందునట్లు తీర్మానించుకుందాం.

## పరిశీలనకైన ప్రశ్నలు

(*జవాబులు – 254వ పేజీలో*)

1. "అపొస్తలుల బోధయందు వారు ఎడతెగక ఉండిరి" అనే ప్రయోగం యొక్క అర్థాన్ని చర్చించు (అపొ. 2:42). నేడు మనకు ఈ ప్రయోగం యొక్క అర్థమేమి?
2. యెరూషలేము సంఘము కలిగియున్న ఏకత్వపు తీరును వర్ణించుము.
3. నేడు క్రీస్తు సంఘము ఎలా కన్పించేలా భావించబడింది?
4. క్రొత్త నిబంధన సంఘం ఏదో, నిర్ణయించడం ఎందువలన గొప్ప నిర్ణయమై యుంటుంది?
5. అపొ. 2లో, పెంతెకొస్తు దినమున క్రొత్త నిబంధన సంఘం ఆరంభ మయ్యిందని సూచించే వచనాలను పేర్కొనుము.
6. మత శాఖలు ఎప్పుడు పుట్టుకొని వచ్చాయి?
7. క్రీస్తు శరీరంగా కూర్చబడింది వ్యక్తిగతమైన క్రైస్తవులా లేక మత శాఖల సంఘాలా? (1 కొరింథీ. 12:24 చూడు).
8. క్రొత్త నిబంధన సంఘం ఎలా పేరుపెట్టబడిందో అదే విధంగా ఓ సంఘం ఎందుకు పేరు పెట్టుకోవాలి?
9. నేటి సంఘములు క్రొత్త నిబంధన సంఘపు ఆచారాలను వెంబడింప వలసిందేనా?

## పద సహాయకారి

**ఆయనయందు నిలిచియుండు –** ప్రభువైన యేసుయొక్క ఉపదేశాన్ని ప్రేమించి, పఠించి, లోబడియుండడం (యోహాను 8:30–32).

**రొట్టె విరుచుట –** ప్రభురాత్రి భోజనం చేయడం (అపొ. 2:42; 20:7లను చూడు).

**పరిచారకులు –** స్థానిక సంఘములో సేవ చేయుటకు ఏర్పరచబడిన యోగ్యులైన మనుష్యులు (1 తిమోతి 3:8–13). వారు పెద్దల క్రింద పని చేస్తారు (ఫిలిప్పీ. 1:1; అపొ. 20:28).

**పెద్దలు –** స్థానిక సంఘాన్ని పై విచారణ చేయడానికి ఏర్పరచబడిన అనుభవ యోగ్యమైన క్రైస్తవ పురుషులు (1 తిమోతి 3:1–7).

**వాయిద్య సంగీతము –** తీగ, గాలి, యిత్తడి వాయిద్యములు, కీ బోర్డ్స్ లేదా డ్రమ్స్ అనే వాటిమీద వాయించే పాటలు మానవ కల్పిత పద్ధతులే. సంఘం యొక్క ఆరాధనకు సంబంధించి క్రొత్త నిబంధనలో అలాటి సంగీతము ప్రస్తావించబడలేదు. మన బహిరంగ ఆరాధనలో  పాటలు పాడుటయే భాగమైయుండాలని దేవుడు కోరుతున్నాడు (హెబ్రీ. 2:12బి; ఎఫెసీ. 5:19; కొలస్సీ.  3:16). బహిరంగముకాని భక్తి భావనలలో పాటలు పాడుట ప్రోత్సహించబడింది (యాకోబు 5:13).

**ప్రొటెస్టాంట్స్ –** ప్రొటెస్టాంట్ రిఫర్మేషన్ యొక్క సూత్రాలపై తమ విశ్వాసమును ఆచరణలను ఆధారం చేసికొని వచ్చిన మత శాఖలు. ఈ ఉద్యమం యొక్క నాయకులు కథోలిక్ ఆచరణలకు వ్యతిరేకముగా తమ అసమ్మతిని లేక ఆక్షేపణను తెలిపారు. (పోపులయొక్కయు ప్రీస్టులయొక్కయు అధికారాన్ని గుర్తించడంలాంటివి). ఈ ఉద్యమం కొన్ని లోటుపాటులను నిరాకరించిన మాట వాస్తవమే అయినా, క్రొత్త నిబంధన సంఘం మాత్రం – యితరులు ఏమి ఆచరిస్తున్నారో అనేదానికి సంబంధం లేకుండానే దేవుని వాక్యముపై ఆధారపడవలసి యుంటుంది.

[1]ప్రభురాత్రి భోజనము ఎన్ని సార్లు ఆచరించాలో అనేది లూకా ఈ వాక్య భాగములో చర్చించలేదు గాని, యేసు పునరుత్థాన దినమైన వారములో మొదటి రోజున సంఘము ప్రభురాత్రి భోజనములో పాలుపొందినట్లు అపొ. 20:7లో లూకా తెలియజేశాడు.